# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






## తెప్పపై విహరించిన గోవిందరాజు



తిరుపతి, ఫిబ్రవరి 17ప్రభాతవార్త : తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయం పుష్కరిణిలో కన్నుల పండువగా శనివారం రాత్రి తెప్పోత్సవాలు ప్రారంభ్జమయ్యాయి. ఏటా స్వామివారికి జరిగే ఈ తెప్పోత్సవాల్లో తొలి రోజు శనివారం సాయంత్రం గోవిందరాజ స్వామి ఉత్సవ మూర్తులను కోదండ రాముని గా అలంకరించి తెప్పపైకి వేంచేపు చేశారు. ఆలయ అర్చకులు కర్పూర హారతులిచ్చి తెప్పను కదిలించారు. భక్తుల గోవిందనామ స్మరణలతో పుష్కరిణి మారుమోగింది. నేడు రుక్మిణీ సత్యభామసమేత పార్థ సారదిగా దర్శనమివ్వనున్నారు.



రివ్వురివ్వున అంతరిక్షంలోకి దూసుకుపోతున్న జిఎస్ఎల్వి ఎఫ్14

## ప్రభుత్వ పథకాల పనితీరులో

# జిల్లాకు మొదటి స్థానం గర్వకారణం

### అంతర్జాతీయ స్థాయిలో ఎక్కడా అమలుచేయని గొప్ప వ్యవస్థ

### రైతు భరోసా కేంద్రాల వ్యవస్థ : జిల్లా కలెక్టర్ కె. లక్ష్మీ షా



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పనితీరులో జిల్లాకు మొదటి స్థానం దక్కడం గర్వకారణం అని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీ షా అన్నారు. శనివారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశ మందిరము నందు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులతో కలిసి జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రైతు భరోసా కేంద్రాలు, రైతులకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు, రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల సరఫరా తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల పనితీరులో జిల్లాకు మొదటి స్థానం దక్కడం గర్వకారణంగా ఉందని వ్యవసాయ శాఖ వారికి అభినందనలు తెలిపారు. జిల్లా స్థాయిలో వ్యవసాయ సలహా మండలి కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిరుధాన్యాలతో రుచికరమైన 100 రకాల వంటలు పుస్తకాన్ని సంబంధిత అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సమీక్షలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారి గీతారాణి, మైక్రో ఇరిగేషన్ శాఖ అధికారి సతీష్, నీటిపారుదల శాఖ అధికారి వెంకటరమణ, వ్యవసాయ సలహా మండలి సభ్యులు, అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అదిగదిగో...

### - అంతరిక్షంలోకి అందమైన ప్రయాణం

### - జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్ తెచ్చిన నయనానందం





షార్ మీడియా సెంటర్‌లో ఇస్రో చైర్మన్‌కు విజయాభినందనలు

శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త శనివారం సాయంత్రం సరిగ్గా 5.35 గంటలు. శ్రీహరికోట నుంచి ఎప్పటిలాగే ఒక రాకెట్ అంతరిక్షయానం చేసింది. అయితే ఇది కొన్ని వేల కళ్లకు కనులవిందుగా మారింది. ఒకవైపు సూర్యుడు, ఎదురుగా నిప్పులు చెరుగుతూ దూసుకెళ్లిన భారీ ఉపగ్రహ ప్రయోగ వాహక నౌక. ఎదురెండలో ఎంతో అందంగా ఈ దృశ్యం కనిపించింది. శ్రీహరికోటలో జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్ భారతీయ సమాచార ఉపగ్రహం ఇన్‌శాట్ 3డిఎస్‌ను అంతరిక్ష కక్ష్యలోకి మోసుకెళ్లిన క్షణాలు అవి. 18 నిమిషాలకు పైగా ఈ రాకెట్ ప్రయాణం సాగగా, అందులో సగం సేపు రాకెట్ స్పష్టంగా కనిపించడం విశేషం. ఆకాశ గర్జనలతో అటువైపు తిరిగిన జనం మళ్లీ కళ్లార్పలేదు. ఇదిలావుంటే ఈ రాకెట్ ప్రయోగం 18 నిమిషాల 46 సెకన్లకు విజయవంతంగా ముగిసింది. శ్రీహరికోట నుంచి ఈ ఏడాది జరిగిన రెండవ ప్రయోగం ఇది. జియో సింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. ప్రయోగం అనంతరం ఇస్రో శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఇది వెరీ బ్యూటిఫుల్ ప్రయోగంగా అభివర్ణించారు. గతంలో ఈ సిరీస్‌లో కొన్ని అవరోధాలు ఎదురైన కారణంగా నాటీ బాయ్‌గా పిలిచేవారు. అయితే జిఎస్ఎల్వి సిరీస్‌లో 2023లో ఒక ప్రయోగం విజయవంతంగా జరిగింది. ఆ తర్వాత వరుసగా రెండో ప్రయోగం శనివారం సూపర్ సక్సెస్ సాధించింది. శాస్త్రవేత్తల్లో ఆనందోత్సాహాలు కనిపించాయి. ఈ ప్రయోగ విజయం తర్వాత మిషన్ కంట్రోల్ సెంటర్ నుంచి మాట్లాడిన వారిలో ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్‌తో పాటు షార్ డైరెక్టర్ ఎ.రాజరాజన్, విఎస్ఎస్‌సి డైరెక్టర్ ఎస్.ఉన్నికృష్ణన్ నాయర్, యుఆర్ఎస్‌సి డైరెక్టర్ ఎం.శంకరన్, ఎల్‌పిఎస్‌సి డైరెక్టర్ వి.నారాయణన్, ఇస్ట్రాక్ డైరెక్టర్ బిఎల్ రామకృష్ణ, ఐఐఎస్‌యు డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్, మిషన్ డైరెక్టర్ టామి జోసఫ్, శాటిలైట్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌లు ఉన్నారు.

# పలమనేరు వైకాపాలో ముడుముక్కలాట...!

### తానే అంటున్న వెంకటేగౌడ

### తెరపైకి గోవిందప్ప శ్రీనివాసులు,భూమిరెడ్డి మోహన్‌రెడ్డి

చిత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: పలమనేరు వైకాపా అభ్యర్థిత్వంపై ఉత్కంఠ నెలకొంది. 2024 పార్లమెంటు, అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయడానికి వైకాపా అధిష్టానం ఇప్పటికే కరసత్తు ప్రారంభించి 6జాబితాలు విడుదల చేసి నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జీలను నియ మించింది. ఈ ఆరుజాబితాల్లోపలమనేరు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జ ఎవరనే విషయంను వైకాపా అధిష్టానం తేల్చలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుండి వైకాపా తరపున ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే వెంకటేగౌడ పోటీ చేసి తెలుగుదేశంఅభ్యర్థి,మాజీమంత్రి అమరనాథ రెడ్డిపై 30వేలఓట్లకు పైగా మెజార్టీతో విజయం సాధించారు. ఈ ఎన్నికల ఫలితాలను విశ్లేషించిన పరిశీలకులు తెలుగు దేశం పార్టీకి, మాజీ ఎంపి దివంగత రామకృష్ణారెడ్డి కుటుంబానికి కంచుకోటగా వున్న ఈనియోజకవర్గంలో ఇకపై తెలుగుదేశంఆధిపత్యం వుండదని భావించారు. 2019 ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారం దక్కించుకోవడంతో పలమనేరు నుండి తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన మాజీ మంత్రి అమరనాథరెడ్డి క్షేత్రస్థాయి నుండి తెలుగుదేశంను మరింతబలోపేతం చేయడానికి పూనుకున్నారు. ఇదే సమయంలో ఇక్కడి నుండి ఎమ్మెల్యేగా విజయం సాధించిన వైకాపా ఎమ్మెల్యే వెంకటేగౌడ నియోజకవర్గ పరిధిలో పార్టీని వర్గాలుగా విడగొట్టారనే ఆరోపణలు మిన్నంటుతున్నాయి. పలమనేరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల అనంతరం రెండేళ్ళకు ఎమ్మెల్యే వెంకటేగౌడ గ్రాఫ్‌భారీగా పడిపోయిందని రాజ కీయ పరిశీలకులు సైతంపలుమార్లు పేర్కొన్నారు.ఈపరిస్థితుల్లో 2024 అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఇక్కడి నుండి మరోసారి వైకాపా తరపున పోటీ చేయడానికి సిట్టింగ్ఎమ్మెల్యే వెంకటేగౌడరంగంసిద్ధం చేసుకొంటున్నారు. నెలన్నర క్రితం వైకాపా అధిష్టానం అనధికారికంగా ఇచ్చిన లీకుల్లో పలమనేరు అసెంబ్లీ స్థానంనుండి మరోసారి ఎమ్మెల్యేఅభ్యర్థిగా వెంకటేగౌడపోటీ చేస్తారని ప్రకటించింది. ఈ క్రమంలో జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పలమనేరు నియోజకవర్గ పరిధిలో వైకాపాను మరింత పటిష్టం చేయడానికి మాజీ సూపర్‌మార్కెట్ ఛైర్మన్ సుభాష్‌చంద్రబోస్‌ను పార్టీలోకి తీసుకొన్నారు. మంత్రి పెద్దిరెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతోనే సుభాష్ చంద్రబోస్ వైకాపాలోకి వచ్చారని ఈ సారి ఇక్కడి నుండి వైకాపా నుండి సుభాష్ చంద్రబోస్ పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. అయితే ఇది వాస్తవరూపం దాల్చదని ప్రస్తుతం తేలింది. ఈ పరిస్థితుల్లో 2019 ఎన్ని కల్లో ఇక్కడి నుండి వైకాపా తరపున పోటీ చేయడానికి సిద్ధమైన పారిశ్రామికవేత్త భూమిరెడ్డి మోహన్‌రెడ్డి మరోసారి అభ్యర్థిత్వం కోసం తన అదృష్టంను పరీక్షించుకోవాలని నిర్ణయించి నియోజకవర్గంలో తిష్ట వేశారు. పార్టీ అధిష్టానం ఖరారు చేసిన ఆశావాహుల జాబితాలో ఏడాదిన్నర క్రితం నుండి భూమిరెడ్డి మోహన్‌రెడ్డి పేరు వుంది. భూమిరెడ్డి మోహన్‌రెడ్డికి ఆర్థిక పుష్టితో పాటు సిఎం వైఎస్ జగన్‌తో సహా మంత్రిపెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిధున్‌రెడ్డితో సన్నిహిత సంబంధాలు వుండటంతో అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. అలాగే జడ్పీఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు సైతం పలమనేరు వైకాపా అభ్యర్థిత్వంపై గురి పెట్టారు. ప్రస్తుతం జడ్పీ ఛైర్మన్‌గా కొనసాగుతుండటం, పలమనేరు నియో జవకర్గం స్థానికం కావడం, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో వున్న సాన్నిహిత్యంతో ఆయన కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2019 ఎన్నికల నాటి పరిస్థితులు ఇప్పుడులేకపోవడం, మాజీమంత్రి అమరనాథరెడ్డికి నియోజకవర్గంపై గట్టిపట్టు వుండటం,సిట్టింగ్ ఎమ్మెల్యేపై నియోజకవర్గంలో కొంత అసంతృప్తి వుండటంతో ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థి ఎవరైనా విజయం కోసం సర్వశక్తులు ఒడ్డాల్సినపరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితుల్లో వైకాపా అధిష్టానం పలమనేరు వైకాపా అభ్యర్థిగా ఎవరిని ఖరారు చేస్తుందనే విషయంపై నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠతో చూస్తున్నారు.

# వేడెక్కిన రాజకీయం !

### -మూడుపార్టీల్లో హోరాహోరీ ప్రచారం



ప్రభాతవార్త-తిరుపతి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు తిరుపతి జిల్లాలో రాజకీయం వేడెక్కింది. ఒక పార్టీపై మరోపార్టీ వ్యక్తిగత విమర్శలతో బాటు పార్టీల పరంగా పరస్పర విమర్శలతో ముందుకెళుతున్నారు. తామంటే తామేనని పోరాటం మొదలుపెట్టేశారు. ఇప్పటికే అధికార వైసిపి అధిష్టానం పార్లమెంట్‌తో బాటు అసెంబ్లీ స్థానాలకు పోటీచేయనున్న అభ్యర్థులను ఇన్‌ఛార్జిల పేరుతో నియమించి ముందస్తుగా ప్రకటన చేసింది. ఇక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశంతో బాటు జనసేన పార్టీలు తమతమ అభ్యర్థులు ఎవరనేది స్పష్టత ఇవ్వలేకపోయినా పలువురు ఇన్‌ఛార్జిలు తామే అభ్యర్థులమని ప్రచార పోరు మొదలుపెట్టేశారు. తిరుపతి నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి ఎం.సుగుణమ్మ, చంద్రగిరి నియోజకవర్గంలో పులివర్తినాని, శ్రీకాళహస్తి నియోజకవర్గంలో బొజ్జలసుధీర్‌రెడ్డి, నగరి నుండి గాలి భానుప్రకాశ్, సత్యవేడు నుండి హెలెన్, కోనేటి ఆదిమూలంపేర్లు వినిపిస్తున్నాయి. అలాగే గూడూరు, సూళ్ళూరుపేట నియోజకవర్గాల్లో స్థానిక నాయకులు ఇప్పటికే ప్రచారం ఆరంభించినా టిక్కెట్ ఎవరికి వస్తుందోననే మీమాంసలో ఉన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో పూతలపట్టు, జిడినెల్లూరు, చిత్తూరు. పలమనేరు, పుంగనూరు, పీలేరు, తంబళ్ళపల్లి నియోజకవర్గాల్లో టిడిపి శ్రేణులు ఇప్పటికే ఎన్నికల ప్రచారాన్ని సూచాయప్రాయంగా మొదలుపెట్టారు. అధికార వైసిపి తమతమ అభ్యర్థులను దాదాపు ఖరారుచేస్తూ జాబితా సిద్దంచేసి ప్రకటించింది. ఇక తిరుపతి, చిత్తూరు, రాజంపేట పార్లమెంట్ స్థానాలకు అభ్యర్థులను వైసిపి ఖరారుచేసి ఇన్‌ఛార్జిలుగా నియమించింది. ఈ సారి ఎన్నికల్లో తిరుపతినుండి మళ్ళీ సిట్టింగ్ ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి, చిత్తూరు నుండి రెడ్డప్ప పోటీలోఉంటున్నారు. దాదాపు వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా సిట్టింగ్‌లకే సీట్లు ఖరారయ్యాయి. తిరుపతి నుండి యువనేత భూమన అభినయ్‌రెడ్డి, చంద్రగిరి నుండి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఇప్పటికే తమ ఎన్నికల ప్రచారం మొదలుపెట్టి ప్రజల్లోకి విస్తృతంగా కలియతిరిగేస్తున్నారు.

# పక్కాగా ఎన్నికల విధులు

### - జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు



చిత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సార్వత్రిక ఎన్నికల విధులను పక్కాగా నిర్వర్తించి పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు తన క్యాంపు కార్యాలయం నుండి శనివారం ఆర్డీఓలు, తహసిల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లు, విఆర్ఓలు, పంచాయతీ సెక్రటరీలతో పోలింగ్ కేంద్రాల పరిశీలన, రేషన్ పంపిణీ, ఇళ్ళ స్థలాలు తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో జెసి మాట్లాడుతూ ఎన్నికల విధులు ఎప్పుడు కొత్తగానే వుంటాయని ఈ విధులను పక్కాగా నిర్వర్తించి పూర్తి చేయాలన్నారు. 18-21 సంవత్సరాలలోపు యువత ఫామ్-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకొన్న వారు వారి స్కూల్ సర్టిఫికేట్, ఆధార్, బర్త్ సర్టిఫికేట్‌ను ఇఆర్ఓలు పరిశీలించిన అనంతరం కలెక్టరేట్‌లో పరిశీలించుకోవాలన్నారు. అలాగే ఫామ్-7కు సంబంధించి డబుల్ ఎంట్రీలు, డూప్లికేట్, మృతి చెందిన వాటిని మరొక సారి పరిశీలించాలని, ఫామ్-8కు సంబంధించి తహసిల్దార్లు స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్ళి పరిశీలించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుండి డిఆర్ఓ బి.పుల్లయ్య, డిప్యూటీ కలెక్టర్ వెంకటశివలు పాల్గొనగా వారి కార్యాలయాల నుండి ఆర్డీఓలు, తహసిల్దార్లు, మున్సిపల్ కమీషనర్లు పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై

# "శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు"



చంద్రగిరి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపినాద్, సూపరింటెండెంట్ నర్రా మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు డి.వి.కృష్ణమాచార్యులు, అధ్యాపక సంతానకృష్ణన్, పరిచారిక డాక్టర్ లక్ష్మీ రాజేష్, డాక్టర్ ఉదయ్ తేజ, జమేదర్ జలెందర్, సుబ్రమణ్యం, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# నగరిలో కొత్తగా ఎంవిఐ ఆఫీసు ఏర్పాటు

### సిఎంకు మంత్రి రోజా కృతజ్ఞతలు

పుత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : నగరి కేంద్రంగా మోటారు వాహనాల తనిఖీ అధికారి (ఎంవిఐ) ఆఫీసు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే పుత్తూరులో ఒక ఎంవిఐ ఆఫీసు వుండగా, నగరి నియోజకవర్గంలో కొత్తగా మరొక ఎంవిఐ ఆఫీసుకు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. నగరి కేంద్రంగా వుండే ఈ ఎంవిఐ ఆఫీసు పరిధిలోకి నగరి, నింద్ర, విజయపురం, కార్వేటినగరం, వెదురుకుప్పం, పాలసముద్రం మొత్తం ఆరు మండలాలను చేర్చారు. గతంలో పుత్తూరు కేంద్రంగా ఎంవిఐ ఆఫీసు వుండగా దాని పరిధిలో రామచంద్రాపురం నుంచి సత్యవేడు వరకూ 14 మండలాలు వుండేవి. కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల నగరి నియోజకవర్గంలోని మొత్తం అయిదు మండలాల్లో విజయపురం, నింద్ర, నగరి చిత్తూరు జిల్లాలోనూ, పుత్తూరు, వడమాలపేట మండలాలను తిరుపతి జిల్లాలో కలిపారు. జిల్లాల విభజన కారణంగా పుత్తూరు ఎంవిఐ ఆఫీసు పరిధిలో వుండే నగరి, నింద్ర, విజయపురం మండలాలను చిత్తూరు ఎంవిఐ ఆఫీసు పరిధిలో చేర్చారు. దీంతో ఈ మండలాల ప్రజలు లైసెన్స్, వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తదితర అవసరాలకు చిత్తూరుకు వెళ్లాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా నగరి కేంద్రంగా మరొక ఎంవిఐ ఆఫీసు ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి విజ్ఞప్తి చేశారు. మంత్రి విజ్ఞప్తి మేరకు నగరి కేంద్రంగా మరొక ఎంవిఐ ఆఫీసుకు సిఎం ఆమోదం తెలిపారు. ఈ ఆఫీసుకు సిబ్బందిని, ఆఫీసు నిర్వహణకు అయ్యే ఖర్చును చిత్తూరు డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డిటిసి) ఆఫీసు నుంచి సమకూరుస్తారు. తిరుపతి డిటిసి పరిధిలో పనిచేసే పుత్తూరు ఎంవిఐ ఆఫీసు పరిధిలోకి పుత్తూరు, వడమాలపేట, నారాయణవనం, పిచ్చాటూరు, నాగలాపురం, సత్యవేడు మండలాలతో పాటు శ్రీసిటీ కూడా వస్తుంది. గతంలో పుత్తూరు ఎంవిఐ ఆఫీసు పరిధిలో వుండే ఎస్.ఆర్.పురం మండలాన్ని చిత్తూరులోనూ, రామచంద్రాపురం మండలాన్ని తిరుపతిలో కలిపారు. నగరి నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం మరో ఎంవిఐ ఆఫీసు మంజూరు చేసినందుకు మంత్రి రోజా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

## స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరపి ప్రిన్సిపల్

## డా. మాధవికి రెండు ప్రత్యేక అవార్డులు



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త స్విమ్స్ కాలేజ్ ఆఫ్ ఫిజియోథెరఫీ ప్రిన్సిపల్ డా. మాధవి జూపూర్‌లో ఫిబ్రవరి 3 - 4వ తేదీలలో జరిగిన ఫిజియో సమ్మెట్ కాన్ఫరెన్స్, ఫిబ్రవరి 16 - 17వ తేదీలలో కర్ణాటక రాష్ట్రం ధార్వాడ్‌లో జరిగిన మొదటి ఫిజియో కాన్ఫరెన్స్‌లలో రెండు ప్రత్యేక అవార్డులను అందుకున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్‌వి కుమార్ అవార్డులను అందుకున్న డా. కె. మాధవిని డైరెక్టర్ చాంబర్ నందు అభినందించారు.



# కళ్లనీళ్ళు తెప్పిస్తున్న "వెల్లుల్లి"

చౌడేపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త ఆరోగ్య ప్రదాయనీ వెలుల్లి రోజు రోజుకూ కానరాకుండా పోతోంది. గడ్డ భూమిలో కాస్తే ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. 10రోజుల క్రితం కిలోధర రూ. 420లు ఉన్న వెల్లుల్లి ప్రస్తుతం అమాంతం రూ. 520లకు చేరుకొంది. గతంలో కేవలం రూ. 150నుంచి 200మాత్రమే కిలో ధర పలుకుతుండేది. ప్రతి కూరలోనూ వెల్లుల్లికి ప్రాధాన్యత ఇస్తారు కాబట్టి వాటికి గిరాకీ వుంది. సాధారణంగా వెల్లుల్లి మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుంచి అధికంగా దిగుమతి అవుతోంది. అయితే అక్కడ నుంచి రాకపోవడంతో డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా భావించిన వ్యాపారస్తులు సిండికేట్‌గా ఏర్పడి వెల్లుల్లి ధరలను రోజు రోజుకూ పెంచేస్తున్నారు. సామాన్యులు వెల్లుల్లిని కొనలేని పరిస్థితి నెలకొనింది. కష్టాకోర్చి మార్కెట్‌లో కొనుగోలు చేస్తే కొత్తరకం గడ్డ కావడంతో నాణ్యత లేకుండా పోతోంది. నాణ్యత లేని వెల్లుల్లిని అధిక ధరలకు కొనుగోలు చేసి చేసేది లేక పెదవి విరుచుకోవడం మద్యతరగతి కుటుంబీల వంతైంది. ధరలు ఎప్పుడు దిగివస్తాయోనని వారు ఎదురు చూస్తున్నారు.

# అభయ వెంకటేశ్వరునికి అలంకారాలు : శనీశ్వరునికి షోడషాభిషేకాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 17 ప్రభాతవార్త శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన శనీశ్వరస్వామికి శనివారం ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలు పక్కనే వెలసిన అభయ వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక అలంకారాలు నిర్వహించారు. ఓ వైపు దేవుళ్ళకు పూజలు, మరో వైపు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారుల, సిబ్బంది తలమునకలై ఉన్నారు.శనివారం ఆలయంలోని అభయ వెంకటేశ్వరునికి ప్రత్యేకాలంకారాలతో కన్నులు మిరుమిట్లు గొల్పునట్లు తీర్చి దిద్దుతున్నారు. ఇక శనివారం శనీశ్వరునికి ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో ఒక్కొక్క దేవునికి ఒక్కొక్కరోజు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వ హించటం ఆనవాయితిగా వస్తుంది.ఆలయంలో అభయ వెంకటేశ్వర స్వామి భక్తులకు అభయమిస్తూ దర్శనమిస్తున్నారు.నిలువెత్తు విగ్రహానికి వారం వారం శనివారం స్వామి ఆకట్టుకునే రీతిలో అలంకారాలు నిర్వహిస్తున్నారు. రెండు ఆలయాలు పక్క పక్కనే ఉండటంతో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది.

### శివరాత్రికి సన్నాహాలు

**వారాంతపు రద్దీ: రద్దీ**

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వారాంతంలో భక్తుల రద్దీ పెరుగుతుంది. నాలుగైదు రోజులుగా భక్తుల్లేక వెల వెల లాడిన ఆలయానికి భక్తుల కళ వచ్చింది.ఈ నేపథ్యంలో శనివారం ఆలయంలో రద్దీ ఏర్పడింది. ముఖ్యంగా శనీశ్వరాభిషేకాలకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.శనివారం ఉదయం నుంచి ఆలయంలో భక్తుల రద్దీ విపరీతంగా పెరిగింది. కాలసర్పదోష నివారణ పూజలకు భక్తులు క్యూకట్టారు.



## కెసి హాస్పిటల్‌చే విద్యార్థులకు దంతాలపై అవగాహన

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** మండలంలోని కొత్తిండ్లు ప్రభుత్వ పాఠశాలలోని కుప్పం కెసి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఛైర్మన్ డా॥ మంజునాథ్ అధ్వర్యంలో విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. డా॥ భవ్య మాట్లాడుతూ విద్యార్థులు రోజూ క్రమం తప్పక పళ్ల శుభ్రం చేయాలన్నారు. దంతాలు ఆరోగ్యంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ఉచితంగా పేస్టు, బ్రష్‌లను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో న్యూజెన్ ఇఐడిసి సలహాసంఘం పర్యటన




**కుప్పంరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్‌లో శనివారం న్యూజెన్ ఇఐడిసి సలహా సంఘం పర్యటించింది. ఈసందర్భంగా కాలేజ్ ఛైర్మన్ బిసి నాగరాజ్ అధ్వర్యంలో సలహా సంఘం బోర్డు సమావేశం జరిగింది. వైస్ ఛైర్మన్ డా॥ సునీల్ రాజ్, ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు, ఆర్‌అండ్‌డి డైరెక్టర్ డా॥ కోదండరామయ్య, భారతప్రభుత్వం తరపున డిఎస్‌టి శాస్త్రవేత్త డా॥ నవీన్ వశిష్ట, అహ్మదాబాద్ ప్రొఫెసర్ సరీన్ పాల్గొన్నారు. డా॥ కోదండరామయ్య మాట్లాడుతూ న్యూ జెన్ ఐఇడిసి విద్యార్థులు సాధించిన ప్రగతి, విజయాల గురించి వివరించారు. కళాశాలలో ఏర్పాటుచేసిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ పిసిబి డిజైన్‌అండ్ ప్రోటోటైప్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ త్రో టు టిల్ ఉన్న సదుపాయాలను కమిటీ సభ్యులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో హనీవెల్ టెక్నాలజీస్ ట్రైనర్ చంద్ర అధ్వర్యంలో విద్యార్థులు రూపొందించిన డ్రోన్‌ను ప్రదర్శించారు.

## బదిలీ తహశీల్దార్‌కు ఘనసత్కారం

**రామకుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** రామకుప్పం నుంచి బదిలీ అయిన తహశీల్దార్ మురళిని అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. డిప్యూటీ కలెక్టర్‌గా ఆయన పదోన్నతి పొందడం పట్ల అభినందించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, జడ్పీటిసి నితిన్‌రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, ఎంపిడిఒ రాధాకృష్ణ, డిటి దిలీప్‌కుమార్, నేతలు మురుగేష్, సెంథిల్, భాస్కర్ నాయక్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ భరత్‌చే సిఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



**శాంతిపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త** మండలంలోని కొలమడుగు పంచాయతీ రామాపురంకు చెందిన ఆదిలక్ష్మి అనే మహిళకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన నాలుగు లక్షల రూపాయల చెక్కును ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ అందజేశారు. ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, శ్రీరాములు, మంజునాథ్, పండరీనాథ్, భాస్కర్‌రెడ్డి, చలపతి, రామచంద్ర పాల్గొన్నారు. అలాగే కర్లగట్ట పంచాయతీ వెంకటాపురంలో చిన్నమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల నిమిత్తం పదివేల సాయం అందించారు.

## ప్రజల్ని మేనిఫెస్టోతో మోసగించింది చంద్రబాబు

శాంతిపురం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



2014 ఎన్నికల సందర్భంగా 600కుపైబడి హామీలతో ప్రజల్ని మోసగించింది మాజీ సిఎం చంద్రబాబునాయుడే కాదా అని వైకాపా నేత కోదండరెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. అబద్దాలకు, అక్రమాలకు ఆద్యుడైన మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు వైకాపాప్రభుత్వం, నవరత్నాలు పథకాలపై విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నట్లు పేర్కొన్నారు. గౌనివారి తమ ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు మరచి నేడుశ్రీరంగనీతులుచెప్పడందారుణమన్నారు. వచ్చేఎన్నికల్లోమరలావైకాపాఅధికారంరావడంతథ్యమన్నారు.

## ఉద్యోగుల వెన్ను విరిచిన ప్రభుత్వం –ఎపిజేఏసి

పలమనేరు,ఫిబ్రవరి 17,ప్రభాతవార్త:



ఉద్యోగుల వెన్ను ప్రభుత్వం విరుస్తుందని సమస్యలు వంచకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎపిజేఏసి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యచరణ సమితి పిలుపు నిచ్చింది. స్థానిక పలమనేరు ఎన్జీఒ కార్యాలయం వద్ద శనివారం సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా చైర్మన్ ఆనందబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగులకు రావాల్సిన రూ. 25500 కోట్ల బకాయిలు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 30శాతం మధ్యంతర భృతి మంజూరు చేసి 12వ పిఆర్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న ఏపిజిఎల్ఐ,జిపిఎఫ్ సొమ్ములు కూడా తిరిగి చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఉద్యోగ సంఘాలతో సమావేశమై సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా ,27న చలో విజయవాడ విజయవంతం చేస్తామని హెచ్చరించారు.

## సదుం గురుకుల పాఠశాల విద్యార్థుల ప్రతిభ



**సదుం ఫిబ్రవరి17ప్రభాతవార్త** రాష్ట్ర వ్యాప్తంగా ఎడ్యుకేషన్ ఎఫిపాని మెరిట్ టెస్టను ఈనెల 1వ తేదీన ప్రిలిమ్స్, ఈనెల8వ తేదీన మెయిన్స్ నిర్వహించారు. ఈటెస్టులో సదుంలోని మహాత్మాజ్యోతి బాపూలే గురుకుల పాఠశాల విద్యార్థులు మెరిట్ సాధించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈపాఠశాలలో పదవతరగతి చదువుతున్న లీలాధర్ మొదటిర్యాంకును సాధించారు. అదేవిధంగా ఏడో తరగతి విభాగంలో మిధున్‌కుమార్ రెండో ర్యాంకును సాధించారు. వీరికి శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో బహుమతులను అందజేశారు. బహుమతులను రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఐఏఎస్,జాయింట్ డైరెక్టర్ వి.ఎస్.సుబ్బారావు,కాకినాడ ఆర్‌జేడి జి.నాగవేణి,ఎన్టీఆర్ జిల్లా డిఈఓ యువీ సుబ్బారావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొంటో, నగదు బహుమతులు అందజేశారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. విద్యార్థులు మంచి పేరు తీసుకువస్తున్నారని వారి వల్ల ఈగురుకులానికి మంచి గుర్తింపు వస్తోందని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి పేర్కొన్నారు.

## ప్రజలకు సేవలందిస్తుంటే....రౌడీషీట్లు వేస్తారా..??

పుంగనూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

పోలీసులు పుంగనూరులో చేస్తున్న విధులపై కోర్టును ఆశ్రయిస్తామని, అకారణంగా తెలుగుదేశం నాయకుపై రౌడీషీట్లు తెరవడం దారుణమని తెలుగుదేశం నాయకులు సయ్యద్‌సుహేల్ బాషా అన్నారు. ఈమేరకు ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. పుంగనూరులో ప్రజలకు,పేదలకు అసరాగా నిలబడిన తనపై పోలీసులు అకారణంగా రౌడీషీటు తెరచారని పేర్కొన్నారు. ఇంతవరకు ప్రజాసేవ తప్ప మరేమీ ఎరుగని పలువురు నాయకులను ఎన్నికల సమయంలో రౌడీషీటు వేసి,ఎక్కడా తిరగనీకుండా చేయడం వెనుక వైకాపాకు ఓటమి భయం ఉందన్నారు. తాము చేసిన సేవలు పుంగనూరు ప్రజలు గుర్తుంచుకున్నారని, త్వరలో జరగబోయే ఎన్నికలలో వైకాపాకు బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## కుప్పంలో ఉద్యోగ,ఉపాధ్యాయుల జెఎసి ధర్నా

కుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



వివిధ డిమాండ్ల సాధన కోరుతూ కుప్పంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (ఎపి జెఎసి) అధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సంఘ నేతలు మాట్లాడుతూ రాష్ట్రంలో 15లక్షలమంది ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు పనిచేస్తున్నాయన్నారు. 12వ పిఆర్‌సి కమిషన్ వేసినా ఇంతవరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. ప్రభుత్వం 1.7.23నుంచి 12వ పిఆర్‌సి అమలు చేయడంతో పాటు తక్షణమే మధ్యంతర భృతి 30శాతం ప్రకటించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ హరికుమార్‌ను వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో జెఎసి నేతలు పాల్గొన్నారు

## రైతులకు అండగా నిలిచేది చంద్రబాబే

– తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం

కుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



రాష్ట్ర ంలోని రైతులకు అండగా నిలిచేది మాజీ సిఎం చంద్రబాబునాయుడేనని కుప్పం తెదేపా ఇన్‌ఛార్జ్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. శనివారం కుప్పంలో రైతు చైతన యాత్ర కార్యక్రమంను స్థానిక పూలమార్కెట్‌లో ప్రారంభించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని వైకాపా ప్రభుత్వం కుదేలు చేసిందన్నారు. రైతుల సాగునీరుకు అవసరమయ్యే ప్రాజెక్టుల నిర్మాణం అటకెక్కించారన్నారు. చివరకు ఐదేళ్ల కాలంలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కూడా పూర్తి చేయలేదన్నారు. గతంలో చంద్రబాబు సిఎంగా ఉన్నపుడు రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు కోసం ప్రతి సోమవారం ప్రాజెక్టు వద్దకు చేరుకుని పనులు జరిగేలా చూశారన్నారు. మరలా తెదేపా అధికారంలో రాగానే పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయాన్ని సస్యశ్యామలం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు డా॥ బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపిపిలు చౌడప్ప, సాంబశివం, రైతు విభాగం నేతలు చలపతి, గోపాల్, బాబు, రాజారాం, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సైనికులకు ఎన్నికల విధులు

**చిత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** ఎలక్షన్ విధులు నిర్వర్తించడానికి ఆసక్తి వున్న జిల్లాలోని మాజీ సైనికులు సోమవారంలోపు జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఆర్.విజయశంకర్ ఓ ప్రకటనలో కోరారు. ఎన్నికల విధుల్లో పాల్గొనడానికి ఆసక్తి వున్న మాజీ సైనికులు ఆర్మీ నెంబర్, ర్యాంక్, చిరునామా, ఆధార్ నెంబర్లతో జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంను సంప్రదించాలన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైసిపి ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



**గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభలకు మద్దతుగా శనివారం వైసిపి నాయకులు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్తూరు పుత్తూరు రోడ్డు నుంచి వీరక నెల్లూరు సిద్దేశ్వర కొండ కాలేపల్లి తూగుండ్రం ఎండి మంగళం కడప గుంట ముక్కత్తూరు గంగాధర నెల్లూరు వేల్కూరు మీదుగా ఠాణా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నమరెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఏ కార్యక్రమం తలపెట్టినా భారీ సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని ఆయన ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలే ఈ జనవాహినికి తార్కాణమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణచంద్రా రెడ్డి ఎంపిపి అనిత లోకేష్ జడ్పిటిసి లక్ష్మిప్రియ దామోదరం,వెంకటరెడ్డి, హేమచంద్ర, పట్టాభిరెడ్డి, సురేంద్ర రెడ్డి, రూపా రెడ్డి, రఘునాథ రెడ్డిలతో పాటు పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## దుస్తులు పంపిణీని అడ్డుకున్న పోలీసులు

గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 17ప్రభాత వార్త:

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని వెజ్జుపల్లి పంచాయతీలో టిడిపి నియోజకవర్గ ఇచార్జ్ థామస్ ఆధ్వర్యంలో పేదలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే స్థానిక పోలీసులు రంగప్రవేశం చేసి దుస్తులు, డబ్బులు పంచి ఓటర్లను ప్రలోభ పెడుతున్నారని అడ్డుకున్నారు. దీంతో పోలీసులు టిడిపి నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. అయినా పంపిణీకి తెచ్చిన దుస్తులు కిట్లను పోలీపులు స్వాదీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. థామస్ మాట్లాడుతూ ఓటమి భయంతో నారాయణ స్వామి కుట్రలో భాగంగా పోలీసులను వాడుకొని అధికార దుర్వినియోగానికిపాల్పడ్డారని ఆరోపించారు. ఎన్నికల కోడ్ గాని ఎటువంటి నిబంధనలు గాని అమలులో లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు స్వామిదాస్,నాయకులు కృష్ణమ నాయుడు,నాగిరెడ్డి,మునిరాజులు,దేవరాజులు,కృష్ణారెడ్డి,జ్యోతీశ్వర్ రెడ్డి, దేవసుందరం,పుష్పరాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



## రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ అవార్డుకు విద్యార్థిని ఎంపిక

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ అవార్డుకు విద్యార్థిని గాయత్రి ఎంపికైనట్లు వెదురుకుప్పం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు శనివారం తెలిపారు. విద్యార్థులలోని సైన్స్ పరిజ్ఞానం వెలికితీయడం కొరకు జిల్లా స్థాయిలో మూడు రోజులు చిత్తూరులోని పిఇఎస్ పబ్లిక్ స్కూల్ ఇన్స్పైర్ అవార్డుకు ప్రదర్శన నిర్వహించడం జరిగిందన్నారు. అందులో 365 ప్రాజెక్టులు ప్రదర్శిం చగా 36 ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగిందన్నారు. వెదురుకుప్పం ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న గాయత్రి తయారు చేసిన ప్రాజెక్టు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రకటించారని చెప్పారు. గాయత్రి ప్రాజెక్టు తయారీకి గైడ్‌గా వ్యవహరించిన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు జోత్స్నాను అభినందించారు. ఉపాధ్యాయులు,విద్యార్థులురాష్ట్రస్థాయి ఇన్స్ ఫైర్ అవార్డుకు ఎంపికైన గాయత్రికి అభినందనలు తెలిపారు.

## ప్రజాస్వామ్యం విజయవంతానికి ఓటరే కీలకం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :

ప్రజాస్వామ్యం విజయవంతం చేయడానికి ఓటరు కీలకమని డిప్యూటీ తహశీల్దార్ జయంత్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సమైఖ్య ఈసీ సమావేశంలో ఓటు హక్కు వినియోగం, ఎన్నికల సంఘం తీసుకువచ్చిన కొత్త యాప్‌ల గురించి అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యం విజయవంతంగా నడవాలంటే ఓటర్ల బాధ్యత అధికమని గుర్తించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కవిత, సిసిలు దేవిపుత్రుడు, కళావతి, ఈసీ సభ్యులు, మహిళ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 'బృందావన్' పాఠశాల వార్షికోత్సవం

**చిత్తూరురూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:** చిత్తూరునగరం, సంతపేటలోని బృందావన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌నందు పాఠశాల 11వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి, డైరెక్టరు ప్రియతేజ తెలిపారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ పిల్లలకు క్రమశిక్షణతో కూడిన విద్య ఎంతో అవసరమన్నారు. వివిధ క్రీడల్లో రాణించిన విద్యార్థిని, విద్యార్థులకు బహుమతులను అందజేసారు. అలాగే విద్యార్థులు ఇంగ్లీష్, తెలుగు బాషలలో వివిధ నాటకాలను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## లాక్ట్ హౌస్ మొబైల్ యాప్ సద్వినియోగం చేసుకోవాలి

-సిఐ సంఘమేశ్వరరావు



వెంకటగిరి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:

తాళం వేసిన మీ ఇంటి భద్రత కోసం తిరుపతి జిల్లా పోలీసు అందిస్తున్న ఉచిత సదుపాయాలు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి సిఐ సంగమేశ్వరరావు అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేఖర్లు సమావేశంలో మాట్లడుతూ సిటీలల్లోనే పరిమితం అయిన లాక్ట్ హౌస్ మొబైల్ యాప్ ఇప్పుడు మున్సిపాలిటీలల్లో కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆయన మాట్లడుతూ లాక్ట్ హౌస్ మానిటరింగ్ సిస్టం ఎల్‌హెచ్‌యంఎస్ ఎపి పోలీస్(అండ్ రాయిడ్ పోన్ యాప్) ఇంటికి తాళం వేసి వెళ్ళినట్లు యితే మీరు ఊరు వెళ్లి వచ్చేంత వరకు సిసికెమారా టెక్నాలజీ ద్వారా పర్యవేక్షణలో మీ ఇంటి మీద పోలీస్ నిఘ ఉంచడం జరుగుతుందన్నారు. ఎల్‌హెచ్‌యంఎస్ ఎపి పోలీస్ యాప్‌లోకి వెళ్ళి మీ వివరాలు,చిరునామా,సెల్ నెంబరు వివరాలు సంబందించిన ధరకాస్తు భర్తీ చేస్తే ఆమోదిస్తూ రిజిస్ట్రేషన్ యునిక్ ఐడి ఇస్తారని తెలిపారు. పట్టణ ప్రజలు దీనిని సక్రమంగా సద్వినియోగం చేసుకుంటే దొంగతనాలు పూర్తిగా తగ్గు ముఖం పడుతాయని తెలిపారు.

## టిడిపి ప్రభుత్వంలోనే పేద ప్రజల అభివృద్ధి

: మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ

వెంకటగిరి ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:



ఆంధ్ర రాష్ట్ర ప్రజలు అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలంటే టిడిపి ప్రభుత్వం అధికాంలోకి రావాలని 2024లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు బాధ్యతులు చేపాట్టాలని వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే కురుగుండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం వెంకటగిరి పట్టణంలోని 4 వార్డులోని కుమ్మరమిట్ట ఇష్మాయిత్ నగర్ ల నందు ప్రచారంలో భాగంగా బాబు షూరిటి భవిషత్ గ్యారెంటి కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలతో కలసి ప్రతి ఇంటికి తిరుగుతూ పథకాలను గ్యారెంటి బాండ్‌రూపంలో ప్రజలకు అందజేశారు. ఈ సందర్బంగా కురుగుండ్ల రామకృష్ణ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం చేస్తున్నా ప్రజా వ్యతిరేక విధానాలను ఎండ కడుతూ వచ్చే సార్వత్రిక అసెంబ్లీ ఎన్నికల్లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే చేయబోయే అభివృద్ది సంక్షేమాల గురించి వివరించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత రాష్ట్ర నాయుకులు కేవికే ప్రసాద్,టిడిపి ఎస్‌సి సెల్ నాయుకులు కోళ్ళపూడి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నాయకులచే ప్రచారం

గూడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని రెండో పట్టణ పరిధిలో ఇందిరానగర్ జానకిరాంపేట సిరామిక్ ఇన్నిట్యూట్, మహాలక్ష్మీ దేవస్థానం ప్రాంతంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నియోజకవర్గ ఇన్చార్జి పరిమళ వెంకటేశ్వరరావు ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సెల్ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు ఆమరపు సతీష్ బాబు కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు విరివిగా పాల్గొని పలు ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. వారు మాట్లా డుతూ ఇందిరమ్మ రాజ్యం ఇంటింటా సౌభాగ్యం అని నినాదంతో ప్రచారం జరుగుతున్నది కానీ యువ ముఖ్యమంత్రి ఆడుదాం ఆంద్ర అని రాష్ట్ర ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. ఈ దేశాన్ని 130 సంవత్సరాలు పరిపాలించినకాంగ్రెస్‌పార్టీనాయకులు మన ప్రియతమ నాయకుడు రాహుల్ గాంధీ, యువ నాయకురాలు వైఎస్ షర్మిల రెడ్డి నాయకత్వంలో బలపరిచి కాంగ్రెస్ గుర్తు హస్తం గుర్తుపై ఓటు వేయాలని కోరారు.

## కులధ్రువీకరణ పత్రాల్లో జాప్యం తగదు

గూడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

గూడూరు మండల తహశీల్దార్ కార్యాలయాల నుండి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో అనేక మంది ఉద్యోగ అవకాశాలు పోగొట్టుకునే పరిస్థితి నెలకొందని టిఎన్ఎస్ఎఫ్ నాయకులు తెలిపారు. గూడూరు పట్టణంలోని గూడూరు మండల తహశీల్దార్ కార్యాలయం అధికారులు కుల ధ్రువీకరణ పత్రాలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్బంగా టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ పొరుగు రాష్ట్రమైన తెలంగాణలో పలు ఉద్యోగాలకు మన రాష్ట్రానికి చెందిన అనేకమంది యువత దరఖాస్తులు చేసుకున్నారని అయితే అభ్యర్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అవసరమై ఆయా మండలాల్లో తహశీల్దార్ కార్యాలయాల్లో కుల ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకు ధ్రువీకరణ పత్రాలు మంజూరు కాలేదని తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.

## ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే విడుదల చేయాలి

ఏపీ జెఎసి నాయకులు శ్రావణ్ డిమాండ్

గూడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి 12వ పిఆర్‌సిని ప్రకటించాలని ఏపీ జెఎసి నాయకులు శ్రావణ్ డిమాండ్ చేశారు. గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ టీచర్స్ వర్కర్స్ అండ్ ఫెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. జేఏసి గూడూరు చైర్మన్ శ్రావణ్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఉద్యోగుల ఖాతాల్లో ఉన్న జిపిఎస్ నగదును కూడా తీసుకోలేకపోతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో చిరంజీవి, బాబు, శ్రీనివాసులు, సుధీర్, సుబ్రమణ్యం, రాజు, భాష తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిపిని పరామర్శించిన మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందుతున్న దక్కిలిఎంపిపిరాజశేఖర్‌ను మాజీ మంత్రి నేదురు మల్లి రాజ్యలక్ష్మిపరామర్శించారు. ఆయనఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలు కోవాలని ఆమె ఆకాంక్షించారు. అనారోగ్యంతో బాధప డుతున్న పలువురిని మాజీ మంత్రి నివాసాలకు వెళ్లి పరామర్శించారు. రాజ్యలక్ష్మిఎమ్మెల్యేగా, మంత్రిగాఉన్నప్పుడు ఆప్తులుగా ఉన్న వారిని ఆమె ఇంటికి వెళ్లి కలుసుకుని పలకరించారు. ఆమె వెంట సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైసిపి నాయకులు కృష్ణయ్య ఉన్నారు.

## తిరుపతి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా రామతులసి నియామకం

బాలాయపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



వైఎస్ఆర్‌సిపి పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గంకు చెందిన తిరుపతి జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా కాటూరి రామ తులసిని నియమిస్తూ పార్టీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. తులసి నియామకం పట్ల పలువురు వైసిపిపార్టీకిచెందినవారు. మహిళలు రామ తులసికి అభినందనలు తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తనపై ఉన్న నమ్మకంతో ఈ పదవి ఇచ్చారని ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు. నమ్మకంతో పదవి ఇచ్చారని ఈ పదవికి న్యాయం చేస్తానని తెలిపారు.

## ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

జూనియర్ సివిల్ జడ్జి అనూష




వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి అనూష తెలిపారు. బిసి కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో న్యాయ విజ్ఞాన చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నట్లు తెలిపారు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఫిర్యాదుల చేస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచి నిందితులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఏపిపి ప్రకృతి కుమార్, న్యాయవాదులు రాజారావు, పెట్లు రాంప్రసాద్, అనుపమ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యం

వెంకటగిరి టౌన్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

నీతి నిజాయితీ గలిగిన బిజెపి పార్టీని కేంద్రం రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్ఎస్ఆర్ నాయుడు తెలిపారు. వెంకటగిరిలో అసంపూర్తిగా ఉన్న టిడ్కో గృహాలను ఆయన బిజెపి నాయకులతో కలిసి పరిశీలించారు. బిజెపిని గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. టిడ్కో గృహాలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని ఈ ప్రభుత్వంలో పనులను ఆపినట్లు తెలిపారు. పెద్ద పెద్ద ప్రాజెక్టులనే పూర్తి చేస్తుండగా గృహాల పనులను ఏడు సంవత్సరాల నుండి ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కొన్ని గృహాల పనులు పునాదులకే పరిమితమైనట్లు చెప్పారు. పూర్తయిన గృహాల్లో నివాసం ఉంటున్న వారికి తగు వసతి కూడా లేదని చెప్పారు. లబ్ధిదారులతో మాట్లాడి ఆయన సమస్యలు తెలుసుకున్నారు. బిజెపి నాయకులు యేగేశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిపి భాస్కర్ రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే వరప్రసాద్



బాలాయపల్లి, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

ఎంపిపి గూడూరు భాస్కర్ రెడ్డిని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ పరామర్శించారు. మండలంలోని జయంపు గ్రామం వెళ్లి ఎమ్మెల్యే ఎంపిపిని కలిశారు. ఎంపిపి భాస్కర్ రెడ్డి ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎంపిపితో రాజకీయాలపై ఎమ్మెల్యే వరప్రసాద్ చర్చించారు.

## చెకుముకి పోటీలో విజేతలకు బహుమతులు ప్రదానం

గూడూరు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త



గూడూరు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో విజేతలకు జిల్లా పరిషత్ బాలుర ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం వరప్రసాద్ చేతుల మీదుగా బహుమ తులు అందజేశారు. వారు మాట్లాడుతూ జెవివి ప్రతి సంవత్సరం విద్యార్థుల లో మూఢనమ్మ కాలకు వ్యతిరేకంగా అవగాహన కల్పించడం కోసం సైన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నారని, చెకుముకి పరీక్షలల్లో విజేతలైన విద్యార్థులకు మెమెంటోలు, బహుమతులు ఇచ్చేందుకు ప్రతి సంవత్సరం ఆర్థికంగా సహకరిస్తున్న డాక్టర్ కుడుముల నారాయణని ప్రత్యేకంగా అభినందిస్తున్నానని తెలిపారు. అనంతరం నారాయణ మాట్లాడుతూ నేను చాలా కష్టపడి డాక్టరేట్ పొందానని, అందుకనే చదువుకునే విద్యార్థులకు చేయూతనిస్తున్నానని, విద్యార్థులందరూ బాగా చదువుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు వేరూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, ప్రభాకర్, గుర్రం విజయ్ బాబు, సుబ్బారావు, ఆనంద్, శ్రీనివాసాచారి, స్కూల్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాలంటీర్లకు సన్మానం ...

నాయుడుపేట, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త

దొరవారిసత్రం మండల పరిషత్ కార్యాలయంలో సూళ్ళూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో వాలింటర్లుకు శనివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా వాలింటర్లను శాలువాలతో సత్కరించి ప్రసంశాపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ వాలంటీర్లు ప్రజలకు చేసే సేవలను గుర్తించి ప్రభుత్వం వారికి పురస్కారాలు అందించడం జరుగుతుందన్నారు. ప్రతి వాలంటర్ సైనికులా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండలపార్టీ అధక్షుడు ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డి, ఉపాధ్యక్షుడు దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎపిటిసి జాలా రాజగోపాల్, ఎంపిడిఓ, పంచాయితీ కార్యదర్శిలు మదు, రామయ్య, వాలింటర్లు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సక్రమంగా పనిచేయని ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగిస్తాం

– తడలో సామాజిక తనిఖీల సభ

తడ, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త



తడ మండలంలో పలుచోట్ల ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సక్రమంగా పనిచేయడం లేదని, అటువంటి వారిని గుర్తించి విధుల నుంచి తొలగిస్తామని అధికారులు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల గురించి బహిరంగంగా సమీక్షించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ సివి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు ఏడాదిలో వంద రోజుల పని కల్పించాలని చెప్పారు. మండల పరిధిలోని మాంబట్టు, కొండూరు, రామాపురం ఫీల్డ్ అసిస్టెంట్లు రికార్డులు సక్రమంగా చూపించకపోవడంతో వారిని విధుల నుంచి తొలగించినట్లు చెప్పారు. గత రెండేళ్లుగా జరిగిన ఉపాధి పనుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి భాగ్యలక్ష్మి, ఎపిడి రవికుమార్‌నాయుడు, డిఆర్‌డిఎ ఏపీడీ ప్రభావతి, మండలాధ్యక్షుడు కొళవి రఘురెడ్డి, ఎంపిడిఓ ఆమోస్‌బాబు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

# అంతరిక్ష యాత్ర దిగ్విజయోస్తు

**- శ్రీచెంగాళమ్మను దర్శించుకున్న ఇస్రో ఛైర్మన్ సోమనాథ్**





శ్రీహరికోట (తడ), ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : అంతరిక్ష యాత్ర దిగ్విజయోస్తు అంటూ సూళ్లూరుపేట లోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరిదేవి ఆలయంలో అర్చకులు ఇస్రో శాస్త్రవేత్తలను ఆశీర్వదించారు. శనివారం ఉదయం ఆనవాయితీగా ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ తదితరులు శ్రీచెంగాళమ్మ పరమేశ్వరిదేవిని దర్శించుకున్నారు. సాయంత్రం శ్రీహరికోట నుంచి జరిగే జిఎస్ఎల్వి ఎఫ్14 రాకెట్ ప్రయోగం విజయవంతం కావాలని కోరుతూ అమ్మణ్ణి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు మధుస్వామి, లక్ష్మణ స్వామిలు ఛైర్మన్ సోమనాథ్‌ను ఆశీర్వదించారు. పాలక మండలి సభ్యుడు ముప్పాళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు ఇస్రో శాస్త్రవేత్తలకు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. ఆలయం ఆవరణలోని వినాయకుడు, వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వాముల వద్ద మొక్కులు తీర్చుకున్న ఛైర్మన్ సోమనాథ్.. అనంతరం అమ్మణ్ణి గర్భాలయంలోకి వెళ్లి భక్తిశ్రద్ధలతో నమస్కరించారు. ఈ సందర్భంగా మీడియా వారితో ఛైర్మన్ మాట్లాడుతూ ప్రతి రాకెట్ ప్రయోగానికి ముందులాగే ఈ సారి కూడా చెంగాళమ్మ దేవి ఆశీస్సుల కోసం సూళ్లూరుపేటకు వచ్చినట్లు చెప్పారు. శనివారం ప్రయోగిస్తున్న ఇన్‌శాట్ 3డిఎస్ ఉపగ్రహం దేశానికి ఐదు నుంచి పదేళ్ల పాటు సేవలు అందిస్తుందన్నారు. ఇన్‌శాట్ 3డి, ఇన్‌శాట్ 3డిఆర్ ఉపగ్రహాల తరహాలో ఇది కూడా విజయవంతమైతే ఎంతో మేలవుతుందని చెప్పారు. జిఎస్ఎల్వి ఎఫ్15 రాకెట్ ద్వారా వచ్చే జూన్‌లో నిసార్ ఉపగ్రహాన్ని శ్రీహరికోట నుంచి ప్రయోగిస్తున్నామన్నారు. పిఎస్ఎల్వి సి-59, ఎస్ఎస్ఎల్వి-3 రాకెట్ల ప్రయోగాలు కూడా చేపడతామన్నారు. కర్ణాటకలోని చిత్రదుర్గ నుంచి ఆర్ఎల్వి ప్రయోగం త్వరలోనే ఉంటుందన్నారు. ఛైర్మన్‌తో పాటు ఎంఎస్ఎ గ్రూప్ డైరెక్టర్ గోపీకృష్ణ, ఇస్రో శాస్త్రవేత్త ఖనుంగోలు ఉన్నారు. సూళ్లూరుపేట సిఐ మధుబాబు, ఎస్ఐ రహీమ్‌రెడ్డి, స్థానికులు పాల్గొన్నారు.

## కొత్తూరు గిరిజన కాలనీ వాసికి సిపాయి భరోసా



శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి పంచాయతీలోని కొత్తూరు గిరిజన కాలనీ వాసికి శనివారం రష్ అధినేత, ఎంఎల్సి సిపాయి భరోసాను అందించారు. శ్రీకాళహస్తి నియోజక వర్గంలో డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం సేవల్ని విస్తృతం చేస్తున్నారు. మొదట ఏర్పేడు మండలంలోని తన సామాజిక వర్గానికి చెందిన కుటుంబ యజమాని మృతి చెందితే ఆదుకునేందుకు నెలకు సరిపడ్డ సరకులను అందించే వారు. అయితే శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఈ పథకం ఎంతో చేయూత అని, దానిని అందరు నిరుపేదలకు విస్తరింపజేయాలని సూచించారు.దాంతో ఇటీవల శ్రీకాళహస్తి పట్టణంలో మృతి చెందిన ముస్లిం కుటుంబాలకు సైతం అందించటం మొదలు పెట్టారు. శనివారం నియోజకవర్గంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం శ్రీకాళహస్తి మండలంలోని మారుమూల గ్రామం అయిన కుంటిపూడి గ్రామానికి చెందిన మేకల సుబ్రమణ్యం మృతి చెందారు. ఆయన భార్య వల్లమ్మను పరామర్శించారు. నిరుపేదలను ఆదుకొనుటకు తామున్నామని భరోసా ఇచ్చారు. ఆ కుటుంబానికి 52రకాల నిత్యావసర సరకులను డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం అందించారు. ఏ అవసరం వచ్చినా తమకు చేతనైంత సహాయం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ వెంకటాద్రి, డాక్టర్ బాబూ, శ్రీను, మూర్తి, వెంకటయ్య, శంకరయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంతో అభివృద్ధి చేశా.. మరొక్కసారి అవకాశం ఇవ్వండి

**ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి**



ఏర్పేడు, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త : గత పాలకులు 30సంవత్సరాలలో చేయలేని అభివృద్ధి పనులను గడచిన నాలుగున్నర ఏళ్లలో నియోజక వర్గంలో ఎంతో అభివృద్ధి పనులను చేశా మరొక్క సారి అవకాశం కల్పిస్తే అభివృద్ధే లక్ష్యంగా నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడను న్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్‌రెడ్డి అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని మేర్లపాక పంచాయతీ పరిధిలోని ధళితవాడ, కొత్తకండ్రిగ గ్రామాల్లో ఆయన ఎంపీ మిద్దెల గురుమూర్తి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యంతో కలిసి ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను కరోనా కష్ట కాలంలో కూడా ప్రాణాలను లెక్క చేయకుండా ప్రజల ఆరోగ్యమే మహా భాగ్యంగా తలచి నా చేతనైన సహాయ సహకారాలు అందించిన విషయం మీకందరికి తెలిసిన విషయమే నని ప్రజలకు గుర్తు చేశారు. అదే విదంగా నేను ఎల్లప్పుడు ప్రజల వెన్నంటే ఉండానని తెలిపారు. కొంత మంది నాయకులు ఎక్కడో సుదూర ప్రాంతాల్లో ఉండి నియోజకవర్గ ప్రజలను ఏమాత్రం పట్టించుకోకుండా ఇప్పుడు ఓట్లేసి గెలిపిస్తే అభివృద్ధి చేసేస్తామంటూ ఉత్తరకుమారుడి ప్రగల్బాలు పలుకుతున్నటువంటి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన పేర్కొన్నారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు రుణమాఫీ కాంగ్రెస్‌తోనే సాధ్యం: చింత



నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : భారతదేశంలో రైతురుణమాఫీ చేయాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమౌతుందని మాజీకేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. ఆయన శనివారం నాయుడుపేట పట్టణంలోని పాతబస్టాండు వద్ద కాంగ్రెస్‌పార్టీ నాయకులతో కలిసి రాళ్ళకాదు-రాజధాని కావాలంటూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ మాట్లాడుతూ భారతదేశంలో రైతులు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమౌతుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌పార్టీని ఆశీర్వదించాలన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ యువనాయకురాలు చింతా నీనా, జిల్లాఉపాధ్యక్షుడు గాడి వెంకటయ్య, నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు ఎస్‌కె నాగూర్, గాడి తిలక్, పెంట శ్రీనివాసులు, కొప్పాల వెంకటకృష్ణయ్య, తదితరులు ఉన్నారు.

## సిఎం సభకు బస్సుల తరలింపుపై తెదేపా నేతల ధర్నా



కుప్పం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : అనంతపురం జిల్లా రాప్తాడులో ఆదివారం జరిగే సిఎం జగన్ సిద్ధం సభకు కుప్పం ఆర్టీసీ డిపో నుంచి యాభై బస్సులు తరలించడం పట్ల కుప్పంలో తెలుగుదేశం పార్టీ నేతలు డిపో ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేతలు డా॥ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్‌లు మాట్లాడారు. గతంలో చంద్రబాబు సిఎంగా ఉన్నపుడు కుప్పం డిపోలో 130 కొత్త బస్సులు ఉండేవన్నారు. సుమారు 70 ఇక్కడి బస్సులను వైకాపా ప్రభుత్వం అధికారంలో వచ్చాక ఇతర డిపోలకు తరలించారన్నారు. ఉన్న 60 బస్సుల్లో కూడా 50బస్సులు అనంతపురం రాప్తాడు సభకు ఎలా తరలిస్తారని డిపో మేనేజర్‌ను ప్రశ్నించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా వెంటనే ప్రత్యామ్నాయంగా బస్సులు పునరుద్ధరించాలని కోరుతూ డిఎంకు వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో నేతలు సాంబశివం, డా॥ వెంకటేష్, ఆర్ముగం, కాణిపాకం వెంకటేష్, కె.కన్నన్, ఆర్ఆర్ రవి, మంజు, చలపతి, గోపాల్, సతీష్, వేణుగోపాల్, రమేష్, బాబు, రాజారాం, తదితరులు పాల్గొన్నారు.

జనసేనచే : కుప్పం డిపోలో బస్సులను సిఎం సభకు తరలించి ప్రజలకు ఇబ్బందులు పెట్టడం తగదని జనసేన కోఆర్డినేటర్ డా॥ నరేష్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ప్రజల నుంచి సంతకాలు సేకరించి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందించారు. ఈ తరహా ధోరణులు మానుకోవాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో ఒకరి దుర్మరణం



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం ఇలుపూరు గ్రామానికి చెందిన వేలూరు భాస్కర్ (49) శనివారం విద్యుత్ షాక్‌కు గురై దుర్మరణం పాలయ్యాడు. టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న భాస్కర్ తన దిన చర్యలో భాగంగా యధావిధిగా మున్సిపాలిటీ పరిధిలోని వట్రపాలెం గ్రామానికి ఇసుక తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో 33 కెవి విద్యుత్‌లైన్ ప్రమాదవశాత్తు తగలడంతో భాస్కర్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ కె.రహీమ్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి విద్యార్థి సైన్స్ పరిజ్ఞానంపై అవగాహన ఉండాలి

గూడూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : ప్రతి విద్యార్థి సైన్స్ పరిజ్ఞానంపై అవగాహనతో నైపుణ్యంతో కూడిన విద్యను అభ్యసించాలని నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎండి మసూద్ అహ్మద్, డిఆర్‌డబ్ల్యు కళాశాల అధ్యాపకులు సౌజన్య, గాయత్రిలు విద్యార్థులకు సూచించారు. శనివారం గూడూరు పట్టణంలోని రవీంద్ర భారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సైన్స్ ఎక్స్‌ప్రోను నిర్వహించారు. ముఖ్య అతిధులుగా నాయుడుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎండి మసూద్ అహ్మద్ గూడూరు డిఆర్‌డబ్ల్యు కళాశాల అధ్యాపకులు గాయత్రి, సౌజన్య రవీంద్ర భారతి పాఠశాల డీన్ శ్రీనివాసులు రెడ్డిలు పాల్గొన్నారు. ముందుగా సైన్స్ ఎక్స్‌ప్రో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇ. శ్రావణి ముఖ్య అతిధులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను క్షుణంగా పరిశీలించారు. ముగ్గురు విద్యార్థులకు బహుమతి ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇవిఎంలపై విస్తృతంగా అవగాహన

**- మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ**



చిత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లలో ఓటు వేసే విధానంపై ఓటు వేసే విధానంపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ పేర్కొన్నారు. కమీషనర్ డాక్టర్ జె.అరుణ శనివారం చర్చివీధిలోని మార్కెట్ వద్ద ఇవిఎంల పనితీరు, ఓటు వేసే విధానంపై అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఓటర్లతో మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసిపి రామకృష్ణుడు, సిఎంఎం గోపి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి అభివృద్ధితో పాటు ఆధ్యాత్మికంగా ముందుకెళ్తున్నది

**టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి**



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : తిరుపతిలో ఒక వైపు అభివృద్ధి దిశగా, మరో వైపు ఆధ్యాత్మిక వాతావరణం వెల్లు విరిసేలా ముందు కెళ్తున్నదని టిటిడి ఛైర్మన్, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి ఇస్కాన్ రోడ్డును కలుపుతూ చెన్నారెడ్డి కాలనీ వైపు నుండి నిర్మించిన నూతన కనెక్టవిటీ రోడ్డును శనివారం టిటిడి ఛైర్మన్, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్‌రెడ్డి ముఖ్య అతిధిగా, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ అదితి సింగ్, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, తిరుపతి ఇస్కాన్ టెంపుల్ నిర్వాహకులు రేవతి రమణదాస్ చేతులు మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నేడు ప్రారంభిస్తున్న ఈ నూతన రహదారికి ఇస్కాన్ టెంపుల్స్ వ్యవస్థాపకులైన అభయ చరణారవింద భక్తి వేదాంత స్వామి ప్రభుపాదుల వారి పేరును ఈ మార్గానికి నామకరణం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. తిరుపతిలోని నూతన రహదారులకు మహనీయుల పేర్లను పెట్టడం వలన ఒక ఆధ్యాత్మిక వాతావరణం వెల్లి విరుస్తున్నదన్నారు. డిప్యూటీ మేయర్ భూమన అభినయ్ రెడ్డి మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా చెన్నారెడ్డి కాలని, సింగాలగుంట, కనకభూషణం లే అవుట్ ప్రజలు ఎదుర్కొంటున్న కనెక్టవిటి రోడ్డు ట్రాఫిక్ సమస్యలకు తెరదించుతూ ఈ నూతన రహదారిని నిర్మించడం జరిగిందన్నారు. తిరుపతి అభివృద్ధికి మరిన్ని మాస్టర్ ప్లాన్ రోడ్లను తీసుకురావడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, పుణిత, వరికుంట్ల నారాయణ, మున్సిపల్ ఇంజనీర్ వెంకట్రామిరెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, నాయకులు బొగుల వెంకటేశ్వర్లు, అరుణ్ కుమార్, శ్యామల, పెరుగు బాబుయాదవ్, వంశి, రాజశేఖర్, శివకుమార్, బస్వా బాలసుబ్రమణ్యం, బెల్లం రమేష్, దేవదానం, సురేష్ రాయల్, జక్కా శరత్, పాముల రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తపాలా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

**గ్రూప్ సి అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం**



గూడూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గ్రూప్ సి అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్టుమేన్, ఎమ్‌టిఎస్, అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం గూడూరు డివిజన్ కమిటి ఆధ్వర్యంలో స్థానిక ప్రధాన తపాల కార్యాలయం ఎదుట శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా క్లాస్ 3 ఉద్యోగుల అధ్యక్షుడు గోవింద నాయక్, సెక్రటరీ సీఎస్ రాజులు మాట్లాడుతూ తమ ప్రధాన డిమాండ్లు పరిష్కరించి నూతన పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. కమలేష్చంద్ర కమిటీ సానుకూల సిఫార్సులను అమలు పరచాలన్నారు. 8వ వేతత సవరణ కమిటీని తక్షణమే నియమించాలన్నారు. గ్రూప్ సంఘాల గుర్తింపును తిరిగి పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. నిలిపివేసిన 18 నెలల కరువు భత్యం బకాయిలను తక్షణమే మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.చంద్రశేఖర్, సయ్యద్ ఫిరోజ్, సుబ్బలక్ష్మి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్‌సేవ

నారాయణవనం, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త :నారాయణవనంలోని కళ్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుమనోహరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించి ఊరేగించారు. అనంతరం 5 గంటల నుంచి గంట పాటు ఊంజల్‌సేవ నిర్వహించారు. పర్యవేక్షకులు నాగరాజు, ఇన్స్‌పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, సాంబయ్య, అర్చకులు పాల్గొన్నారు.

## ఢిల్లీ సదస్సులో పాల్గొన్న కోలా.ఆనంద్



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : ఢిల్లీలోనిభారత్ మండపంలో బిజెపి జాతీయ అధ్యక్షులు జెపి.నాడ్డ అధ్యక్షతన బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశానికి శ్రీకాళహస్తి నుంచి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ హజరయ్యారు. ఈసందర్భంగా బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశాలకు ఢిల్లీకి బయలుదేరి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మరియు రాష్ట్ర నాయకులతో కలసి పాల్గొన్నారు. అధ్యక్షులు జెపి.నడ్డా అధ్వర్యంలో బిజెపి జాతీయ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.

## వైసిపికి ఒక న్యాయం....టిడిపికి మరో న్యాయమా!

**-టిడిపి పోస్టర్లు తొలగింపును నిరసిస్తూ టిడిపి శ్రేణులు నిరసన**



తిరుపతిరూరల్, ఫిబ్రవరి17 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజాపాలన జరగలేదని... ఎమ్మెల్యే చెవిరెడ్డి కుటుంబ నిరంకుశ పాలన కొనసాగుతుందని చంద్రగిరి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోపించారు. తిరుపతిరూరల్ మండలంలో టిడిపి పోస్టర్స్, స్టిక్కర్స్‌కు తొలగింపుకు నిరసనగా శనివారం ఎంపిడిఓ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేసారు. తెలుగుదేశం పార్టీ ప్రచారం ప్రజల్లోకి వెళ్ళకుండా అడ్డుకుంటున్నారని, అధికార వైసిపి నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లకు, స్టిక్కర్లకు లేని నిబంధనలు తెలుగుదేశం పార్టీ పోస్టర్లకు, స్టిక్కర్లుకు ఎందుకని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, వేమూరు మధు, బిరుదాల భాస్కర్‌రెడ్డి, నాగూరు శ్రీనివాసులు, జయరామిరెడ్డి, తిరుచానూరు కిశోర్‌రెడ్డి, కాయం వెంకటేష్, మధుశేఖర్, గోఫి తదితరులు పాల్గొన్నారు.

## జగన్ సభకు ఆర్టీసి బస్సులు... సామాన్యులకు కష్టాలు : గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : అనంతపురంలో జరిగే ముఖ్యమంత్రి సిద్ధం సభకు పుత్తూరు ఆర్టీసి డిపోలోని బస్సులను తరలించడం వల్ల సామాన్య ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాశ్ తెలిపారు. శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ 350 కిలోమీటర్ల దూరంలో వున్న అనంతపురం సభకు పుత్తూరు డిపో నుంచి బస్సులు తీసుకెళ్లడం అది కూడా ఆ బస్సులు జనం లేకుండా ఖాళీగా వెళ్లడం వైసిపి నాయకుల భావ దారిద్ర్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సామాన్య ప్రజానీకం పల్లెలకు వెళ్లేందుకు బస్సులు లేక నానా అవస్థలు పడుతున్నారన్నారు. పుత్తూరు డిపోలో వున్న మొత్తం77 బస్సులుండగా అందులో 41 బస్సులను అనంతపురానికి తరలించారని తెలిపారు. తిరుపతి -నగరి, పుత్తూరు - చిత్తూరు, పుత్తూరు - సత్యవేడు మార్గాల్లో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలైన అప్పలాయిగుంట, పాలసముద్రం, విజయపురం, నింద్ర, కె.వి.బి.పురం తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు శనివారం ఉదయం నుంచి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.

## బిజెపి అభివృద్ధిపై గోడలపై ప్రచారం

తిరుపతి, ఫిబ్రవరి 17ప్రభాతవార్త: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ సారధ్యంలో దేశంలోని ప్రజలకు చేసిన మంచి పనులు, సంక్షేమ కార్యక్రమాలు అమలుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు గోడలపై రాతలు రాస్తున్నారు. ఇందుకు తిరుపతిలో బిజెపి ఓ కమిటీని ఏర్పాటుచేసింది. వాల్‌రైటింగ్ కమిటీలో కో ఆర్డినేటర్‌గా పెనుబాల చంద్రశేఖర్, కన్వీనర్‌గా గుండాల గోపీనాథరెడ్డి, కో కన్వీనర్లుగా బిందురెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలను నియమించారు. ఈ కమిటీ నాయకత్వంలో కార్యకర్తలు తిరుపతిలోని ప్రైవేటు వ్యక్తుల గోడలపై వారి అనుమతితో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అమలుచేసిన పథకాలు వివరించనున్నారు.

## వాలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శం

**వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి**

బాలాయపల్లి, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త : వాలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శమని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తెలిపారు. బాలాయపల్లి మండలంలోని వాలంటీర్లను వందనం కార్యక్రమం పేరుతో ఎన్‌జెఆర్ భవనంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలంటీర్ల వ్యవస్థను సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా మన రాష్ట్రంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరిస్తారని తెలిపారు. ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వాలంటీర్లు నేరుగా ప్రజలకు చేరవేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కార్తీక్ రెడ్డి, నాయకులు రాయి రమేష్ చౌదరి, చింతల శ్రీనివాసులు రెడ్డి, దశరథ రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధులు వాలంటీర్లు : ఎమ్మెల్యే



పలమనేరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త:ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వాలంటీర్లు వారధులని ఎప్పటికప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విషయంలో వాలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా తెలిపారు. శనివారం పలమనేరు మండలంలోని కరిడిమడుగు సచివాలయం నందు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రం, జగనన్న పాల వెల్లువ కేంద్రాలయాలను, కుర్మాయిలో వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించారు. స్థానిక ఎంపిడీఓ కార్యాలయంలో పలమనేరు రూరల్ వాలంటీర్లకు సత్కర కార్యక్రమం నిర్వహించారు.

## తిరుపతికి చేరిన ఆంధ్రరాష్ట్ర సమితి బస్సు యాత్ర



తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 17, ప్రభాతవార్త : రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, కుల మతాలకతీతంగా ప్రతి ఒక్కరూ అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ఆంధ్రరాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్రను నిర్వహిస్తున్నామని సమితి వ్యవస్థాపకులు కోటేశ్వర రావు తెలిపారు. శనివారం సాయంత్రం బస్సు యాత్ర తిరుపతి చేరుకుంది. ఈ సందర్భంగా పార్టీ వ్యవస్థాపకులు కోటేశ్వర రావు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం 9 అంశాలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. అనంతరం బస్సు యాత్ర చిత్తూరు జిల్లాకు బయలుదేరింది. ఈ యాత్రకు ఆంధ్రరాష్ట్ర సమితి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఓటరు సమాచార కేంద్రాలు సద్వినియోగం

**- డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ పిలుపు**



చిత్తూరు, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: ఓటు ప్రాధాన్యత, ఓటును వినియోగించుకునేందుకు నిర్దేశించిన ఓటరు సమాచార కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ పిలుపునిచ్చారు. చిత్తూరు మండల సమాఖ్య కార్యాలయంలో డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ శనివారం ఓటరు సమాచార కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రజాస్వామ్య దేశంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత వుందని, ప్రతి ఓటరు తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో వున్న మహిళలకు ఆర్థికపరమైన పలు అంశాలపై అవగాహన కల్గిందని, ఇదే తరహాలో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో ప్రజాస్వామ్య విలువలను పెంచి ఓటు విలువ దాని ప్రాధాన్యతపై అవగాహన కల్పించడానికి సమాచార కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిపిఎం వెంకటేష్, ఎపిఎం వలీ, మండల సమాఖ్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నగర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

**- సబ్‌కమిటీ ఏర్పాటుకు వినతి**
**- చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు**



చిత్తూరురూరల్, ఫిబ్రవరి 17 ప్రభాతవార్త: చిత్తూరు నగర ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యసేవలను అందించడం కోసం అపోలో, ప్రభుత్వ అధికారులతో కలసి ఒక సబ్‌కమిటీని ఏర్పాటుచేసినట్లు చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు తాండవమూర్తి, కార్యదర్శి శివకుమార్, అధికార ప్రతినిధి సత్యలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శనివారం చిత్తూరు స్మార్ట్ సిటీ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు అపోలో ఆసుపత్రి, ప్రభుత్వ అధికారులను కలసి సబ్‌కమిటీని ఏర్పాటుచేయాలని వినతి చేయగా వారు సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు. ఈ కమిటీలో అపోలో తరపున ఇద్దరు, ప్రభుత్వం తరపున ఇద్దరు, సిఎస్‌సిడిఎస్ తరపున 5మంది సభ్యులు నగరప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. అపోలో కీలక అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్‌లు సబ్‌కమిటీ ద్వారా సమస్యలు మా దృష్టికి వస్తే ప్రాధాన్యత క్రమంలో అపోలో వారి సమన్వయంతో పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. అలాగే చిత్తూరు నియోజకవర్గానికి ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఏర్పాటుకు వచ్చే పాలకులతో కలసి సమన్వయం చేసుకొని పోరాటం చేస్తామని తాండవమూర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ రామ్‌గోపాల్‌రెడ్డి, సూపరింటెండెంట్ సుధాకర్‌బాబు, ఆర్‌ఎంఓ సంధ్య, హ్యూమన్ రైట్స్ శోభారాణి, రిటైర్డు ఎస్ఐ మురళీ తదితరులు పాల్గొన్నారు.